నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, సోమవారం 13 జనవరి 2025 | KARIMNAGAR

₹4 వేల పింఛన్ ఎప్పుడిస్తవ్ రేవంత్?

సిరిసిల్లలో ముగ్గుల పోటీల్లో మహిళల వినూత్న నిరసన

సిరిసిల్ల టౌన్, జనవరి 12: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతుండడంపై మహిళల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఆదివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో స్థానిక కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించగా, 32వ వార్డులో 'రూ.4వేలు పింఛన్ ఎప్పుడు ఇస్తావు రేవంత్‌రెడ్డి' అంటూ లక్ష్మి అనే మహిళ రాయగా, వృద్ధులు, పింఛన్ లబ్ధిదారులు నిరసన తెలిపారు. అలాగే, మరో మహిళ 'తులం బంగారం కట్' అంటూ ముగ్గు వేసి నిరసన తెలిపింది.

ధాన్యం షిఫ్టింగ్‌కు ప్రయత్నాలు?

- అధికారులపై మిల్లర్స్ నాయకుల ఒత్తిళ్లు
- నిబంధనలకు విరుద్ధమని తెలిసీ ముందుకు అడుగులు
- ఈనెల 31 వరకు ఈ వానకాలం ధాన్యం కొనుగోలు చేస్తామని మంత్రి ప్రకటన • కొనుగోళ్లు జరుగుతుండగా షిఫ్టింగ్‌కు ఎలా అనుమతి ఇస్తారంటూ ప్రశ్నలు

కరీంనగర్, జనవరి 12 (నమస్తేతెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా దాదాపు 22 శాతం మిల్లర్లు.. సీఎంఆర్ ధాన్యాన్ని అమ్ముకున్నట్లుగా గత కొంత కాలంగా ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే. దీనిపై గతంలోనే ప్రభుత్వం పూర్తి వివరాలు అరా తీసింది. సీఎంఆర్ కింద తీసుకున్న ధాన్యం మేరకు.. నిర్ణీత వ్యవధిలో బియ్యం పెట్టకుండా బకాయి పడ్డ మిల్లులకు ఈసారి ధాన్యం ఇచ్చే ప్రశ్నే లేదని ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు.. తదుపరి కొన్ని నిబంధనలను సవరించినా.. డిఫాల్ట్ అయిన మిల్లులకు మాత్రం ధాన్యం కేటాయింపులు లేవు. నిజానికి చాలా మంది మిల్లర్లు గతంలో వివిధ రకాల పైరవీల ద్వారా సామర్థ్యానికి మించి ధాన్యం కేటాయింపులు చేయించుకున్నారు. ఆ మేరకు.. బియ్యాన్ని ఎఫ్‌సీఐకి పెట్టాలి. కానీ, వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లే కొంత మంది విక్రయించుకున్నారు. అలాగే, కొంత మంది బియ్యాన్ని అమ్ముకున్నట్లుగా గతంలో జరిగిన టాస్క్‌ఫోర్స్ తనఖీల్లో వెల్లడైంది. ఈ నేపథ్యంలో.. పలువురు మిల్లర్లను డిఫాల్టర్లుగా గుర్తించారు. నిబంధనల ప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలి.

ధాన్యం షిఫ్టింగ్‌కు ప్రయత్నాలు?

డిఫాల్ట్ అయిన మిల్లుల యజమానులు తాము చేసిన తప్పులనుంచి బయట పడేందుకు ధాన్యం షిఫ్టింగ్ పేరుతో కొత్త మార్గాన్ని అన్వేషించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కేటాయింపులు జరిగిన మిల్లుల నుంచి డిఫాల్ట్ అయిన మిల్లులకు ధాన్యం కేటాయింపులు జరిగేలా చూసి.. ఆ మేరకు బియ్యం పెట్టి.. డిఫాల్ట్ నుంచి బయట పడాలని చూస్తున్నట్లు సమాచారం. అలా జరిగితే, ఈ ఖరీఫ్ ధాన్యం తిరిగి వచ్చే జనవరి వరకు పెట్టుకునే అవకాశం సదరు మిల్లులకు కలుగుతుంది. దీని ద్వారా సదరు మిల్లులు లబ్ధిపొందడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఇందులో భాగంగానే.. సదరు డిఫాల్ట్ మిల్లులకు.. ధాన్యం షిఫ్టింగ్ చేసుకునేందుకు కొంత మంది మిల్లర్లు అసోసియేషన్లను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఆ మేరకు అసోసియేషన్‌లోని కొంత మంది నాయకులు.. డిఫాల్ట్ మిల్లులతో అంతర్గత ఒప్పందాలు చేసుకొని.. షిఫ్టింగ్ అనుమతులకోసం ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. అంతేకాదు.. ఉమ్మడి జిల్లాలోని రెండు జిల్లాల్లో ఇందుకు సంబంధించి ఫైల్‌ను మూవ్ చేయడానికి శత విధాలా ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. అయితే.. ఈ అనుమతులు ఇవ్వడానికి కొంత మంది అధికారులు నిరాకరిస్తుంటే.. ''ఎలా ఇవ్వరో చూస్తాం'' అంటూ కొంత మంది అసోసియేషన్ నాయకులు బెదిరింపులకు దిగుతున్నట్లుగా తెలుస్తోంది. నిజానికి ఈ సీజన్‌లో కొనుగోళ్లు ఈనెల 31 వరకు కొనసాగిస్తామని ఇటీవలే పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఏ పరిస్థితుల్లోనూ సింగిల్ షిఫ్టింగ్ కూడా చేయడానికి వీలు లేదని తెలుస్తోంది. ఈ నిబంధనలను కాదని అధికారులు అనుమతులు ఇస్తే.. సదరు అధికారులపై ప్రభుత్వం వేటువేసే అవకాశం ఉంది. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని వారు భయపడుతున్నారు. అయితే.. ఏ పరిస్థితుల్లోనైనా షిఫ్టింగ్‌కు అనమతులు సాధించాలని కొంత మంది నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం. కాగా.. ఒకవైపు కొనుగోళ్లు సాగుతున్న తరుణంలో షిఫ్టింగ్ కోసం మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు ఎలా ప్రయత్నాలు చేస్తారంటూ.. కొంత మంది మిల్లర్స్ యజమానులు సదరు అసోసియేషన్ నాయకులను ప్రశ్నించినట్లుగా తెలుస్తోంది. అంతే కాదు.. నిబంధనలను విస్మరించిన మిల్లర్లకు అండగా అసోసియేషన్స్ ముందుకు వెళ్లడం భావ్యం కాదని, ఇందుకోసం అధికారులపై ఒత్తిళ్లు తేవడం వల్ల.. మిగిలిన వారిపై ఆ ప్రభావం పడుతుందని కొంత మంది మిల్లర్లు అడుగుతున్నట్లుగా తెలుస్తోంది. దీంతో మిల్లర్స్ అసోసియేషన్‌లో ప్రస్తుతం ఇదో హాట్‌టాపిక్‌గా మారగా.. అధికారులు నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గుతారా? లేక నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తారా? అన్నది రెండు మూడు రోజుల్లో తేలనుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ మార్కెట్లో ధాన్యం విక్రయించుకున్న కొంత మంది మిల్లర్లు తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు అడ్డదారుల్లో వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం ధాన్యం షిఫ్టింగ్‌కు పాల్పడాలని చూస్తుండగా.. ఈ వ్యవహారానికి ఆయా జిల్లాల అసోసియేషన్ నాయకులు కొందరు వంత పాడుతున్నట్లుగా తెలుస్తున్నది. ఇందు కోసం కొన్ని ఒప్పందాలు కుదుర్చుకొని. అనుమతులకోసం సంబంధిత అధికారులపై ఒత్తిడి పెట్టినట్లుగా అత్యంత విశ్వసనీయ సమాచారం. అయితే.. విషయం బయటకు వస్తే తమ ఉద్యోగాలకు ఎసరు వస్తుందని కొంత మంది అధికారులు అభ్యంతరం చెప్తుండగా.. ఎలా ఇవ్వరో చూస్తామంటూ వారిని బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం కొనుగోళ్లు కొనసాగుతుండగా.. డిఫాల్ట్ మిల్లుల షిఫ్టింగ్ అనుమతుల కోసం ఎందుకు ప్రయత్నాలు చేస్తున్నారంటూ.. కొంత మంది మిల్లర్లే అసోసియేషన్ నాయకులను ప్రశ్నిస్తున్న తీరు ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌ను ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, వేదికపై మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు రమణ, జీవన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, తదితరులు

నిధులు ప్రభుత్వానివా.. కాంగ్రెస్ పార్టీవా?

సమావేశంలో నిలదీస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

- ఎస్‌డీఎఫ్ నిధులు కాంగ్రెస్ ఇన్‌చార్జిల పేరిట ఎలా ఇస్తరు?
- రేషన్ కార్డు లేకుంటే పథకాలకు అర్హులు కాదా?
- విలీన గ్రామాల్లో 'ఉపాధి' కూలీల పరిస్థితి ఏంటి? • ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో ప్రశ్నలు సంధించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- ఇందిరమ్మ ఇండ్లకు ఉచిత రిజిస్ట్రేషన్లు ఇవ్వాలన్న గంగుల
- సీడీఎఫ్ నిధులు ఎమ్మెల్యేలకే ఇవ్వాలని కౌశిక్‌రెడ్డి డిమాండ్

"కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి నియోజకవర్గానికి రూ.5 కోట్ల సీడీఎఫ్ ప్రతి ఎమ్మెల్యే పేరిట ఇచ్చారు. కావాలంటే అప్పటి ప్రొసీడింగ్స్ కూడా చూపుతాం. ఇప్పుడు అందుకు విరుద్ధంగా జరుగుతోంది. కాంగ్రెస్ ఇన్‌చార్జి పేరిట ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేశారు. ప్రభుత్వ జీవోల్లో కాంగ్రెస్ ఇన్‌చార్జి అని ఇచ్చారు. మరి ఈ నిధులు ప్రభుత్వానివా?, కాంగ్రెస్ పార్టీవా?'' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ ప్రశ్నించారు. ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో పథకాల అమలు విషయమై ప్రభుత్వ తీరును నిలదీశారు.

కరీంనగర్, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ కలెక్టరేట్‌లో ఆదివారం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొనగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ మంత్రులకు పలు ప్రశ్నలు సంధించారు. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి ప్రభుత్వం అమలు చేయబోయే నాలుగు కొత్త పథకాల విషయంలో కొన్ని అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు అదే రోజు లబ్ధిదారులను ఎంపిక చేస్తామని, కొత్త రేషన్ కార్డులు కూడా అదే రోజు ఇస్తామని అంటున్నారని, అయితే, రేషన్ కార్డు ఉంటేనే ఇండ్లకు అర్హులని అంటున్నారని, కొత్త రేషన్ కార్డు అదే రోజు తీసుకునే నిరుపేదల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. అలాగే, పట్టణ ప్రాంతాల్లో ఎల్ఆర్ఎస్ కట్టలేని పరిస్థితిలో ఉన్న పేదలకు ఇంటి స్థలాన్ని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించాలని కోరారు. వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు ఇస్తామని, ఇందుకు ఉపాధి హామీ కార్డును ప్రామాణికంగా తీసుకుంటామని అంటున్నారని, పట్టణాల్లో విలీనమైన గ్రామాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈ కార్డును ప్రామాణికంగా తీసుకోవద్దని, అలాగే 20 రోజులు పని చేయాలనే నిబంధన కూడా తొలగించాలని కోరారు. ప్రతి గ్రామంలో 60 శాతం మంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఫొటోలు తీసుకుని సర్వే చేస్తుంటే తమకు ఇండ్లు వచ్చాయనే భ్రమలో నిరుపేదలు ఉన్నారని, ఈ విషయంలో క్లారిటీ ఇవ్వాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల విషయంలో పరిశీలిస్తామని చెప్పారు.

ప్రతి నియోజకవర్గానికీ ఇండ్లు కేటాయించాలి : ఎమ్మెల్యే పాడి

ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లు ఇస్తామని ప్రభుత్వం చెబుతోందని, అయితే, ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా కేటాయించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. తాము కూడా ప్రజలు ఓట్లు వేస్తేనే గెలిచామని చెప్పారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, హుజూరాబాద్, సిరిసిల్ల, కోరుట్ల నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిల పేరిట ఎస్‌డీఎఫ్ నిధులు ఇస్తున్నారని, తన నియోజకవర్గంలోనే రూ.10 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు మూడో స్థానంలో ఉన్న కాంగ్రెస్ ఇన్‌చార్జి పేరిట ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ జీవోల్లో కాంగ్రెస్ ఇన్‌చార్జ్ అని ఇచ్చారని, మరీ ఈ పైసలు ప్రభుత్వానివా?, కాంగ్రెస్ పార్టీవా? అని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీల్లోనూ ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత ఇవ్వలేదని తెలిపారు. ఎస్‌డీఎఫ్ నిధులు ఎమ్మెల్యేల పేరిట ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కింద రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన నియోజకవర్గంలో తక్షణమే దళిత బంధు రెండో విడుత ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా విప్ అడ్లూరి లక్ష్మణ్ జోక్యం చేసుకునే ప్రయత్నం చేయగా దళితబంధు ఇవ్వవద్దని అంటారా? అని ప్రశ్నించారు. తాను గతంలో జడ్పీ మీటింగ్‌లో ప్రశ్నించినందుకు కేసు పెట్టారని, ఇప్పుడు కూడా కేసు పెడతారా? అని నిలదీశారు. కేశవపట్నం మండలంలోని కల్వల ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయాలని కోరారు.

ఎంత మందికి వస్తాయో క్లారిటీ ఇవ్వాలి

ఇందిరమ్మ ఇండ్లు సర్వే జరుగుతుంటే నిరుపేదలు తమకు మంజూరైనట్లే భావిస్తున్నారని, నిజానికి కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 60 డివిజన్లలో ఒక్కో డివిజన్‌లో 600 నుంచి వెయ్యి మంది ఇండ్లకు వెళ్లి ఫొటోలు తీసుకున్నారని, ఒక్క నగరంలోనే పది వేల మంది లబ్ధిదారులు ఉంటారని మేయర్ వై సునీల్‌రావు తెలిపారు. జిల్లాలోని అన్ని అర్బన్ ఏరియాలకు కలిపి 12 వేల ఇండ్లు మాత్రమే ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నారని, ఎంత మందికి వస్తాయో క్లారిటీ ఇవ్వాలని కోరారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ ఇండ్లు అందరికీ వస్తాయని, కానీ ఎప్పుడు వస్తాయనేది మనందరం కలిసి నిర్ణయించాలని కోరారు.

- మేయర్ వై సునీల్‌రావు

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి : ఎమ్మెల్సీ రమణ

రైతు భరోసా కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని ఎమ్మెల్సీ ఎల్ రమణ హితవుపలికారు. ఎగవేసిన రెండు విడుతల రైతుభరోసాను ఇప్పుడు కలిపి ఇవ్వాలన్నారు. గతంలో గుంట, రెండు గుంటలున్న వారికి కూడా రైతుబంధు, రైతు బీమా ఇచ్చారని, ఇప్పుడు 2 ఎకరాలు ఉన్న వారిని కూడా రైతు కూలీలుగా గుర్తించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలో ఇచ్చిన ఇండ్లు శిథిలమవుతున్నాయని, వారిని గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. జగిత్యాల జిల్లాలోని నూకపల్లి హౌసింగ్ సొసైటీలో 5 వేల ఇండ్లు నిర్మిస్తే ఇంకా వెయ్యి ఇండ్లు ఖాళీగా ఉన్నాయని, వాటిని నిరుపేదలకు కేటాయించాలని కోరారు. జగిత్యాల అర్బన్ హౌసింగ్ సొసైటీలో కూడా ఇదే పరిస్థితి ఉన్నదని, వీటిని పూర్తి చేసి అర్హులైన పేదలకు కేటాయించాలని కోరారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టుకు షెట్టర్లు బిగిస్తే 20 నుంచి 30 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని సూచించారు.

కాలనీ వీధిలో పారుతున్న మన్నెంపల్లి కెనాల్ నీరు

పండుగ పూట.. కన్నీటి వ్యథ

- మన్నెంపల్లి కెనాల్‌కు మళ్లీ గండి.. ఎస్సీకాలనీలోకి నీళ్లు
- ఇండ్లలోకి చేరడంతో తడిసిన సామగ్రి
- ఇప్పటికే మూడుసార్లు తెగినా నిర్లక్ష్యం వీడని అధికారులు
- మండిపడుతున్న గ్రామస్తులు

ఇండ్లలోకి చేరిన నీరు

తిమ్మాపూర్, జనవరి 12 : పండుగ పూట మండలంలోని మన్నెంపల్లిలో గల ఎస్సీ కాలనీకి సంతోషం లేకుండా పోయింది. ఆదివారం తెల్లవారుజామున డీ 4 కెనాల్‌కు మళ్లీ గండిపడడంతో జలదిగ్బంధంలో చిక్కుకున్నది. గతంలోనే మూడుసార్లు గండిపడినా అధికారులు తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడంతో సమస్య మళ్లీ పునరావృతమవుతున్నదని, ఇదేం నిర్లక్ష్యమని ప్రజలు మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి రిజర్వాయర్ నుంచి వచ్చే ప్రధాన కాలువ కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం పీచుపల్లి గ్రామం మీదుగా సైదాపూర్ వెళ్తుంది. ఇదే క్రమంలో పీచుపల్లి వద్ద డీ4 కాలువ విడిపోయి తిమ్మాపూర్, మానకొండూర్ మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీటిని అందిస్తుంది. ఈ క్రమంలో మన్నెంపల్లి మీదుగా చంజర్ల తదితర గ్రామాల మీదుగా వెళ్లే ఈ కెనాల్, గ్రామంలోని ఎస్సీ కాలనీ పైన కాలువ కట్ట పరిమాణం తక్కువ మోతాదులో ఉండడం, ఎత్తుగా ఉండడంతో నీళ్లు మర్లపడుతున్నాయి. దీనికి తోడు కాలువలో చెత్తాచెదారం తీయకపోవడంతో నీరు వెళ్లలేక తరచూ గండిపడుతున్నది. ఇప్పటికే మూడు సార్లు తెగిపోగా, ఆదివారం తెల్లవారుజామున మరోసారి గండిపడడంతో మన్నెంపల్లి ఎస్సీ కాలనీ జలమయమైంది. వీధులన్నీ నీటితో నిండిపోయాయి. అయితే కాలువ గండి పడిన సమీపంలో గుట్ట ఉండగా, దాని వరద నీళ్లు బయటకు వెళ్లేందుకు కెనాల్ కింద నుంచి డీబీ ఏర్పాటు చేశారు. గండి నుంచి బయటికి వస్తున్న నీరు ఆ డీబీ గుండా గ్రామంలోకి చేరుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ప్రజలకు సహాయక చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి బండి సంజయ్, కలెక్టర్ పమేలా సత్పతిని ఆదేశించి, ఘటనపై ఆరా తీశారు. గ్రామాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సందర్శించి, బాధితులతో మాట్లాడారు.

వరద వచ్చి ముంచేసింది

ఆదివారం తెల్లవారే సరికి వరద వచ్చి ఇంటిని ముంచేసింది. ఇది ఒక్కసారి జరగలే. గతంలో ఇలానే జరిగింది. అప్పటిమందం సమస్య పరిష్కరించి వదిలేస్తున్నరు. మళ్లీ పునరావృతం అవుతున్నది. పొద్దుపొద్దున్నే నీళ్లు రావడంతో ఇంట్ల సామాన్లన్నీ తడిచిపోయినయ్. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి మాకు మరోసారి సమస్య లేకుండా చూడాలి. **- సుదగోని సదయ్యగౌడ్**

తాత్కాలిక మరమ్మతులు చేస్తం..

200 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న డీ4 కాలువకు స్థాయికి మించి రైతులు నీటిని మళ్లించుకున్నారు. దీంతో సామర్థ్యం సరిపోక తెగిపోయింది. గతంలో సైతం అదే ప్రాంతంలో తెగిపోయింది. శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపిస్తే పలు కారణాలతో రిజెక్టు అయింది. ప్రస్తుతం తెగిన గండికి తాత్కాలిక మరమ్మతులు చేపించి దిగువన ఉన్న రైతులకు నీటిని అందిస్తం. శాశ్వత పరిష్కారానికి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తం. **- పెద్ది రమేశ్, ఇరిగేషన్ ఎస్ఈ**

వరదచ్చి ఇంట్ల సొత్తది..

కాలువ తెగినప్పుడల్లా నీళ్లచ్చి ఇంట్ల సొత్తన్నయ్. వరదచ్చి సక్కగ ఇంట్లకు ఉర్కచ్చి సమానంత కరాబైతది. ఆదివారం తెల్లవారేటల్లకు వరద అచ్చింది. ఒక్కన్నే ఉంట. ఈ వరదలకే ఇళ్లు కూలేటట్టుంది. సామాన్లన్నీ తడిసినయ్. అండుకు నేటట్టులేదు, తినేటట్టులేదు. గిట్లుంది పరిషాను. మాకు ఇండ్లిత్తం అన్నరు. మా దిక్కు సూసినోళ్లు లేరు. మళ్లీసరి నీళ్లు రాకుంట సూడాలె. **- జూల వెంకటి, మన్నెంపల్లి**

బెల్లి యాదయ్యకు పురస్కారం అందజేస్తున్న తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, మాజీ ఎమ్మెల్సీ నారదాసు, నిర్వాహకులు

కల్లోలంలో జీవించిన కవి అలిశెట్టి

తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ

కమాన్‌చౌరస్తా, జనవరి 12 : కల్లోలంలో జీవించిన కవి అలిశెట్టి ప్రభాకర్ అని తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ పేర్కొన్నారు. తెలంగాణ రచయితల వేదిక కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఇస్తున్న అలిశెట్టి ప్రభాకర్ రాష్ట్ర స్థాయి పురస్కారం -2025 సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలతి ఆలతి పదాలతో అనంత అర్థాలను సృజించిన గొప్ప కవిత్వం అలిశెట్టిదని, ఎక్కువ ప్రసంగికత గల సాహిత్యాన్ని రాశారని గుర్తు చేశారు. ప్రజల పక్షం వహించి, ప్రజల కోసం రాసిన కవిత్వం అలిశెట్టి ప్రభాకర్‌దని తెలిపారు. ఈ పురస్కారాన్ని నల్లగొండ జిల్లా కవి డాక్టర్ బెల్లి యాదయ్యకు అందజేశారు. పురస్కార శాశ్వత ప్రదాత నారదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ అలిశెట్టిని ప్రతి కవి ఆవాహనం చేసుకోవాలని, సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాజోజు నాగభూషణం, దామరకుంట శంకరయ్య, బూర్ల వుంకటేశ్వర్లు, విలాసాగరం రవీందర్, మెరుగు ప్రవీణ్, కొండి మల్లా రెడ్డి, అన్నవరం దేవేందర్, కందుకూరి అంజయ్య, పీఎస్ రవీంద్ర, మమత వేణు, పెనుగొండ బసవేశ్వర్, సరసిజ, నసీరుద్దీన్, నడిమెట్ల రామయ్య, గజేందర్ రెడ్డి, బీవీఎన్ స్వామి, కొత్త అనిల్ కుమార్, బాలసాని కొమురయ్య, ఎర్రోజు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో తెలంగాణ శిథిలం

- అబద్ధాలు చెప్పి అధికారంలోకి..
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

పెద్దపల్లి, జనవరి 12: ఎలాగైనా అధికారం రావాలనే కాంక్షతో అనేక అబద్ధాలు చెప్పి.. ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకొని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం పూర్తిగా శిథిలమైతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్‌లో బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష ఆధ్వర్యంలో నిర్వహించిన స్వయం ఉపాధి, ఇన్సూరెన్స్, ఆర్థికంగా ఎదగడంపై అవగాహన సదస్సు, ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరుద్యోగ యువత, పేదలు తమ కాళ్ల మీద తాము నిలబడేలా స్వయం ఉపాధి పొంది, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చి రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు పెట్టాలన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కుతూ అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఫార్ములా ఈ-కార్ రేస్ వల్ల రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చేవని, చేయని తప్పుకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయాలని చూశారని తెలిపారు. ఫార్ములా ఈ -కార్ రేసు, మొబిలిటీ వ్యాలీ రద్దు చేయకుంటే, తెలంగాణ ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్‌కు కేంద్రంగా మారేదని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడినందుకు సీఎం రేవంత్ రెడ్డిపై 420, 406 సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భువనగిరిలో బీఆర్ఎస్ ఆఫీసుపై దాడి జరిగితే పోలీసులు పట్టించుకోకుండా నిందితుడిని సీఐ కుర్చీలో కూర్చోబెట్టి రాచ మర్యాదలు చేశారని, ఓటుకు నోటు కేసులో జైలు శిక్ష అనుభవించి, అనేక కేసులు ఉన్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే పరిస్థితి ఇలాగే ఉంటుందని తెలిపారు. అధ్వాన్నంగా ఉన్న గురుకులాలను తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పదేళ్లలో ప్రపంచస్థాయిలో నిలబెడితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే నాశనం చేసిందని ధ్వజమెత్తారు. 54 మంది విద్యార్థులు చనిపోతే ఒక్క కుటుంబాన్ని కూడా సీఎం పరామర్శించలేదని, గురుకులాలను భ్రష్టు పట్టించడమే లక్ష్యంగా కాంగ్రెస్ సర్కారు కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో ఉష, హనుమయ్య, అరుణ క్వీన్, కందికంటి విజయ్, గుంటికాడి రాణి పాల్గొన్నారు.